

స్వామి వివేకానంద డిగ్రీ కళాశాలలో గణేశ్ మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధి బి.నాగేశ్వర్‌రావు సూచించారు. శనివారం విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (ఎస్‌వీఎస్) ఈకో క్లబ్, వృక్షశాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈకో ప్రిజర్వేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి.నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై చెట్లకు రాఖీలు కట్టారు. అదేవిధంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.ప్రభు, డాక్టర్ ఎస్.అనురాధ, కె.నీరజ, ఎ.షీబాని, ఎన్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పద్మజ, మహేష్, డాక్టర్ ముక్తావాణి, మంజులత తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌లింగంపల్లిలో సమస్యలను పరిష్కరించాలని జలమండలి కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ రవిచారి

కలుషిత నీరు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి జలమండలి కార్యాలయం పరిధిలోని చిక్కడపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, ఎంఐజీ, హెచ్‌ఐజీ, సోప్ ఫ్యాక్టరీ లేన్, ఈశ్వర్‌రెడ్డి గల్లీ, అరోరా కాలేజీ, సూరజ్‌నగర్ ప్రాంతాల్లో కలుషిత నీరు, డ్రైనేజీ లీకేజీ సమస్యలను పరిష్కరించాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి డిమాండ్ చేశారు. ఈ విషయంలో జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బాగ్‌లింగంపల్లిలోని జలమండలి మేనేజర్ కార్యాలయం వద్ద శనివారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికార్జున్ నగర్‌లో..

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జున్ నగర్‌లో కలుషితనీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ జలమండలి అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నల్లాల్లో వస్తున్న కలుషితనీటిని ఆయన పరిశీలించారు. వెంటనే మంచినీటి, డ్రైనేజీ లైన్‌లను శుభ్రం చేయాలని కోరారు.



మల్లికార్జున్ నగర్‌లో కలుషిత నీటిని చూపిస్తున్న బీజేపీ నాయకులు చుక్కా జగన్ తదితరులు



అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రమణ

పేదలకు అల్పాహారం పంపిణీ

చిక్కడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి ధర్మమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ పీఆర్వో డా.జీకే.రమణ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించిన రమణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లు ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. ప్రవీణ్‌కుమార్, నర్సింగ్, సాయిరితీష్, భాస్కర్, లక్ష్మణ్, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

● **అల్పాహారం, పండ్లు పంపిణీ**



కందూరు కృష్ణ ఫౌండేషన్, సేతు మానిక్‌లాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలో పేదలకు ఉచిత అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖవైద్యులు డాక్టర్ సింగరాజు విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందూరి కృష్ణఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణ, ఫౌండేషన్‌ల సభ్యులు కౌశిక్, జ్వాల, గోవింద్‌రావు, డాక్టర్ సంగీత, నారాయణగౌడ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.
- (రాంనగర్, ఆంధ్రజ్యోతి)

డ్రైనేజీ నూతన పైప్‌లైన్ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని రిసాలగడ్డ పాత కల్లు కాంపౌండ్ సమీపంలో డ్రైనేజీ నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తన బడ్జెట్ నుంచి రూ.20లక్షలను మంజూరు చేశారని బీఆర్‌ఎస్ నగర నాయకులు పూసగోరక్‌నాథ్ తెలిపారు. దీంతో శనివారం గోరక్‌నాథ్ ఆధ్వర్యంలో స్థానిక బస్తీ నాయకులు కె.సత్యనారాయణ తోపాటు పలువురు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాచిగూడలో రైల్వే ప్రయాణికుడి అదృశ్యం

బర్కత్‌పుర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడు అదృశ్యమయ్యాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన రాథోడ్‌దేవదాస్ వృత్తిరీత్యా అగ్రికల్చర్. తిరుపతి నుంచి కుటుంబసభ్యులతో అకోలా ఎక్స్‌ప్రెస్‌రైల్‌లో శనివారం తెల్లవారుజామును 3.10 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు దిగిన తరువాత ఆదిలాబాద్ వెళ్లడానికి రైళ్ల వివరాలను తెలుసుకోవడానికి బయటకు వెళ్లిన దేవదాసు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫ్లాట్ ఫారాలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో దేవదాస్ కుమారుడు రాథోడ్ తరుణ్ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదుచేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



రాథోడ్ దేవదాస్

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆరోగ్యం కోసం ప్రజలు పార్కులలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని ఎంఐజీ క్వార్టర్స్‌లో గల తెలంగాణ దశాబ్ది పార్కులో రూ.35లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, ఇతర అభివృద్ధి పనులను రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి సీఐ సీతయ్య, ఎంఐజీ క్వార్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకర్, సభ్యులు శేషయ్య, జార్జ్, రాంచంద్రారెడ్డి, ప్రధానకార్యదర్శి రమణరావు, కోశాధికారి ఎంజే.జోసెఫ్, బీఆర్‌ఎస్ నేతలు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, దామోదర్‌రెడ్డి, వివేక్, బబ్లూ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ దశాబ్దిపార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి, రత్నాకర్‌రెడ్డి తదితరులు

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ముషీరాబాద్: స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతతో పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ముషీరాబాద్ రేడియెంట్ హైస్కూల్, ప్రో కేర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో భరత్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు వైద్య సంస్థలు పేదప్రజలను సేవా భావంతో ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, రక్తపరీక్షలు, ఈసీజీ, దంత, కంటి, ఎముకలు, గైనిక్ సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ రేడియెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఖదీర్, జావిద్ ఖాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దాసోజు లలిత

మహిళల రాజకీయ రిజర్వేషన్లలో బీసీ కోటా ఇవ్వాలి

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల రాజకీయ రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలని ఎరుక సాహిత్య సాంస్కృతిక సామాజిక వేదిక అధ్యక్షురాలు దాసోజు లలిత డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎరుక సాహిత్య సాంస్కృతిక సామాజిక వేదిక ఆధ్వర్యంలో మహిళా రాజకీయ రిజర్వేషన్లు, బీసీ మహిళా కోటా అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థలతోపాటు సాధారణ ఎన్నికల్లో మహిళారిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రద శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు పాశంయాదగిరి మాట్లాడుతూ, రాజకీయ రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఆలిండియా ఓబీసీ జేఏసీ ఉపాధ్యక్షురాలు వనజ, నాయకులు కృపాకర్ మాదిగ, మంగ, కరంగిణి, దుర్గారాణి, రేణుక, కృష్ణ వేణి, పావని, సోగరబేగం, లక్ష్మి, ప్రొఫెసర్ ప్రభంజని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ భవన నిర్మాణానికి కృషి : రాజ్‌కుమార్



పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షుడు నవీన్ తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో పద్మశాలీ శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించేలా కృషిచేస్తానని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో భోలక్‌పూర్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బింగి నవీన్ ఆధ్వర్యంలో వల్లకటి రాజ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలు తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చి 13401 ఓట్ల మెజార్టీతో గెలిపించారని వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. పద్మశాలీలు రాజకీయంగా విద్యా ఉద్యోగ పరంగా రాణించే విధంగా కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, పద్మశాలీ సంఘం నాయకులు బల్లాప్రశాంత్, ఊర్మిల, గణేష్, గడ్డం నవీన్, నారాయణ, వెంకటేష్, సుధాకర్, పుండరీకం, మార్కెండేయ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడుల నివారణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



బషీర్‌బాగ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల కార్యకర్తలు

బర్కత్‌పుర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని పలు సంఘాల నేతలు ఆరోపించారు కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి నిరసనగా శనివారం సాయంత్రం బషీర్‌బాగ్‌లో ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్, ఆల్ ఇండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్, అఖిలభారత మహిళా సాంస్కృతిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు ఎస్.నాగరాజు, ఈ.హేమలత, నితీష్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ హత్య ప్లాన్ ప్రకారమే జరిగిందని, దీనికి బెంగాల్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మి తదితరులు

అసోం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ముషీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అసోంలో స్కూల్‌కు వెళ్లి వస్తున్న బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నగరకార్యదర్శి కె.నాగలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పించాలని కోరారు. ధర్నాలో ఐద్వా నగర అధ్యక్షురాలు పద్మ, నాయకులు వరలక్ష్మి, పుష్ప, లక్ష్మి, రాణి పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ల నియామకం

కవాడిగూడ ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గ కో కన్వీనర్‌గా బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియమాకాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమతి ముషీరాబాద్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ ప్రకటించి, ఆయనకు నియామక పత్రాలు అందజేశారు. శనివారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతవాతవారణంలో జరిగేలా కృషిచేస్తానని తెలిపారు. గణేశ్ ఉత్సవ సమితి, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

● **చిక్కడపల్లి:** భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ డివిజన్ కమిటీల ఏర్పాట్లను ఉత్సవ సమితి సభ్యులతో కలిసి సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా గాంధీనగర్ డివిజన్ కన్వీనర్‌గా మినుకూరి సాయికుమార్‌ను ఎంపిక చేసి నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. గణేశ్ మండపం నిర్వాహకులకు ఉత్సవాల విషయంలో ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే ఉత్సవ సమితి నియోజకవర్గ కార్యాలయ నెంబర్ 7799819991కు ఫోన్ చేయాలని, ఉత్సవ సమితి సభ్యులు మండపం వద్దకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నియోజకవర్గ సభ్యులు పరిమళ్‌కుమార్, మద్దూరి శివాజీ, మహేందర్‌బాబు, శక్తిసింగ్, సాయికిరణ్‌యాదవ్, ఆనంద్‌రావు, అనిల్‌కుమార్, ఆయుష్, మారుతి, కుషాల్‌గౌడ్, రాజేష్‌చారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ప్రారంభమైన ఓపీ, ఓటీ సర్వీసులు

● **విధులకు హాజరైన వైద్యులు, సిబ్బంది**

సనత్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ నిమ్స్ వైద్యులు, సిబ్బంది, రెసిడెంట్ వైద్యులు, కాంట్రాక్ట్ కార్మికులు నిరసన బాట పట్టారు. ఈనెల 18 నుంచి అత్యవసర సేవలు మినహా ఓపీ, ఓటీ సర్వీసులు నిలిపేసి నిరసన తెలిపారు. శనివారం నుంచి విధులకు హాజరయ్యారు. ఓపీ, ఓటీ సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు నిమ్స్‌వైద్యులు తెలిపారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలని, సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్, స్పెషల్ ప్రొటెక్షన్ యాక్ట్‌లను వెంటనే అమలు చేయాలని వైద్యులు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, వైద్యుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా నిమ్స్ వైద్యులు మంత్రి దామోదర రాజనర్సింహకు లేఖ రాశారు.

బతుకమ్మకుంట స్థలం ప్రైవేట్ వ్యక్తులదే : సుధాకర్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మండల పరిధిలోని బతుకమ్మకుంట స్థలం పక్కా ప్రైవేట్ స్థలమని అందులో ఎలాంటి కుంట కూడా లేదని బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. బతుకమ్మ కుంట స్థలం దగ్గరకు వచ్చి అక్కడ కుంటను పునరుద్ధరించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో పాటు కాంగ్రెస్ నేతలు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరడం హాస్యాస్పదంగా ఉందని ఆయన పేర్కొన్నారు. శనివారం చే నెంబర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎంపి వీహెచ్ 20 సంవత్సరాలుగా ఎందుకు ఈ ప్రైవేట్ స్థలం వెంట పడుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన మోయిని చెరువును బతుకమ్మలు వేసేందుకు ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. తనకు, బతుకమ్మ కుంట స్థల యజామానుల మధ్య సంప్రదింపులు నడుస్తున్నాయని, తాను పొజిషన్‌లో ఉన్నానని, ఇందులోకి ఎవరైనా వస్తే కేసులు పెడతామని ఎడ్ల సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. బతుకమ్మ కుంట స్థలం పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులదని తెలిసినా రాజకీయ లబ్ధికోసం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఈ స్థలం ప్రభుత్వ స్థలమని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు జేడీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి

బీజేపీ సభ్యత్వ నమోదులో నగరాన్ని ఆదర్శంగా నిలపాలి

● **పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్**

బర్కత్‌పుర ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో హైదరాబాద్ నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదును ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలన్నారు. శనివారం రాత్రి బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సభ్యత్వ వర్క్ షాప్‌ను సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.గౌతమ్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ప్రధాని మోదీ పార్టీ సభ్యత్వ నమోదును అధికారికంగా ప్రారంభిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీమంత్రి సి.కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్, నాయకులు కన్న రమేష్‌యాదవ్, కృష్ణ గౌడ్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు



పార్టీ సభ్యత్వ వర్క్‌షాప్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న చంద్రశేఖర

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్

బర్కత్‌పుర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, న్యాయవాదుల రక్షణకు జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని దక్షిణ భారత అడ్వొకేట్ జేఏసీ అధ్యక్షుడు సుదానాగేందర్ డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లు తీసుకొచ్చి దేశంలోని న్యాయవాదులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. శనివారం బర్కత్‌పురలోని జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... న్యాయవాదులకు రక్షణ చట్టం ఉంటేనే దాడులు ఆగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధానాగేందర్

'సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు'

చిక్కడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కార్మికశాఖ భవననిర్మాణ కార్మికులకు ఇస్తున్న సంక్షేమపథకాలు వారికి అందకుండా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చి, బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూడవద్దని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం ఫెడరేషన్ ప్రతినిధులు రాములు, రామ్మోహన్‌రావు, కోటంరాజు, రాజులు కార్మిక శాఖడైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం హడావిడిగా టెండర్లను పిలిచి భవన నిర్మాణ సంక్షేమబోర్డు నిధులను ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టే ఆలోచనలు విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 1996 చట్టం ప్రకారం వెల్ఫేర్‌బోర్డు ద్వారానే నిధులను కార్మికులకు అందించాలని కోరారు.

29న సినీ గీత కదంబం

చిక్కడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాగరాగిణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న సాయంత్రం సినీ గీత కదంబం కార్యక్రమం త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నారు. జంటనగరాలకు చెందిన ప్రముఖ గాయనీగాయకులు ఈ సందర్భంగా సినీగీతాలను ఆలపిస్తారని ఆ సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణకుమారి, సుబ్బలక్ష్మి తెలిపారు. వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు, గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అతిథులుగా పాల్గొంటారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికి విశ్రాంత ఉద్యోగి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డునంబర్.12 ఎన్‌బీటీనగర్‌లో ఉండే ఎం.శ్రీహరిగౌడ్ విశ్రాంత ఉద్యోగి 2 రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స పూర్తయి ఇంటికి వచ్చేసరికి బెడ్‌రూమ్‌లోని అల్మారాలు తెరిచి ఉన్నాయి. పరిశీలించగా 30 గ్రాముల బంగారం, వెండి అభరణా లు కనిపించలేదు. శ్రీహరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని సమయంలో భారీ వాహనం నిబంధనలకు విరుద్ధంగా రావడంతో డ్రైవర్‌పై కేసు నమోదైంది. పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు నవాజ్ ఈనెల 23న ఎన్‌ఎఫ్‌సీఎల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. ఇదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా 10 టైర్ల భారీ వాహనం పంజాగుట్ట శ్మశానవాటిక వైపు వెళ్తుండగా గమనించాడు. వాహనాన్ని పక్కకు పెట్టించాడు. డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరినగర్‌లో నివాసం ఉంటున్న నరేష్‌కు 2012లో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. పెద్దకూతురు కొంత కాలం క్రితం మృతి చెందింది. నరేష్ అమీర్‌పేటలో వస్త్ర వ్యాపారం చేసేవాడు. సక్రమంగా నడవకపోవడంతో 2021లో మూసేశాడు. అప్పటి నుంచి ఖాళీగా ఉంటున్న నరేష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ తరుణంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 23వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో మద్యం తాగి ఉన్న నరేష్ భార్యతో గొడవపడ్డాడు. భార్య పిల్లలను బయటకు నెట్టేసి లోపల గడియ పెట్టుకున్నాడు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో వారు పోలీసులకు ఫోన్‌చేశారు. పోలీసులు వచ్చి తలుపులు పగలగొట్టి లోపలకు వెళ్లి చూడగా నరేష్ ఉరేసుకుని వేలాడుతున్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ ముసుగులో వ్యభిచారం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సెలూన్ మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీ సమీపంలోని ఇంజనీర్స్‌కాలనీలో రెయిన్ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పాలో కొంతకాలం నుంచి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమచారం అందింది. దీంతో పోలీసులు పకడ్బందీగా దాడిచేశారు. వ్యభిచారం చేస్తున్న విటుడు ఆర్.విజయ్, మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి ద్వారా వ్యభిచార నిర్వాహకుడు బోడ ప్రవీణ్, బాల్‌రాజ్, రజితతో పాటు వరంగల్, రాంనగర్, విజయవాడకు చెందిన ముగ్గురు మహిళా సెక్స్ వర్కర్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.